
దసరా వెన్నెల! దర్గాగా కొండలమీద వెలుగుతోంది! అడవి తరిగిపోయినా అందాలు తరగని ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా వుంది!

రోడ్లు పడినా, లారీలూ, బస్సులూ, జీపులూ, కార్లూ తిరిగినా నా అందం నాదే అన్న ధీమాగా అడవి అలంకరించుకొని అలరారుతోంది!

వెన్నెల్లో మంచాలు వేసుకొని వెన్నెల వన్నెల్ని, అడవి అందాల ఆనందాన్నీ అనుభవించి అడవి మధ్య ఊరి ఆడా, మగా ఆదమరచి హాయిగా నిద్రపోతున్నారు.

అడవి జీవితం! అదెన్ని కుదుపులో...?! ఎందరో- మరెందరో-ఇంకెందరో అడవిని ఆక్రమించడానికి ఎన్ని యుక్తులో- మరెన్ని కుయుక్తులో - ఇంకెన్ని కుట్రలో - కుహకాలో...?!

అప్పుడు అడవి ఒక్కొసారి ఆక్రోశించింది. అప్పుడు అడవి అనేకసార్లు అంటుకొని మండింది. అప్పుడు



# విలువలు

భూషణం

కొండగాలి పెను ప్రళయంగా వీచి వూపేసింది.

ఆనాడు అడవి నిట్టూర్పులు అడవిగా విడిచింది. అయినా కొండలు కొండల్లాగే నిండుగా వున్నాయి. కొండ జీవితాలు కొండెక్కిపోలేదు. కొండల అందం ఆనందం కొండల్లాగే తలెత్తుకొని నిలబడి నిలిచి వున్నాయి. అడవి ధర్మం అడవిలో అంతర్లీనంగా వుండి అడవి మనసుల ఐశ్వర్యాన్ని అదెవరు గానీ ఎంతవారు గానీ ఏమీ చెయ్యలేరు గాక చెయ్యలేరని చాటిచెప్పి చూపించినట్టుగా వుంది.

ఇదంతా ఇలా ఈ విధంగా ఆలోచిస్తున్నాడా ... అన్నట్టుగా ఊరి చివర వాడిపెరువ్వతో దడికట్టిన గుడిసె ముందర జీలుగు చెట్టు కింద మంచం వేసుకొని వయసు మళ్ళిన ముసలివాడు కూర్చొని వున్నాడు! ఎదట వెన్నెల్లో వేసిన మంచం మీద కూర్చొని ముసలమ్మ ముసలివాన్ని చూస్తోంది. ముసలమ్మ పక్కన



ఇరవయ్యేళ్ళ పడుచుపిల్ల పల్లవు మృదువు బట్టల్లో ముచ్చటగా ముదుచుకు పడుకొని వుంది.

కొండలవేపూ కొండల వెన్నల వేపూ చూస్తున్న ముసలివాన్ని కదపడానికా అన్నట్టు ముసలమ్మ "దిక్కులు సూసుకోని కూకోడవేగానీ పండుక్కి ఎర్రంటిగెల ఎవులికిస్తావన్నిది ఎప్పడికీ తేల్సేవుకాదు కదా" అని అడిగింది.

ముసలివాడు పలకలేదు. ముసలమ్మకు చిరాకనిపించింది."పండించుకోవొస్తన్నాను! నువ్వు నీ తిరుగుళ్ళు తిరిగినావు. నువ్వొదిలెల్లిన గెడ్డ జొలనే కనిపెట్టుకోని కాసుకోనున్నాను! ఎన్ని రంగుల పువ్వులు ఎలిపోనాయి?! కన్నెత్తి సూడకుండా నిలబడిపోనాను. నువ్వు తిరిగొచ్చినావు. తిరిగొచ్చి ఏటి సేసినావు? గురువు సెప్పిన బుద్ధులన్నీ గెడ్డల కలిపేసి గెంజీ అంబలీ మానేసి అదిగదే పనిగా సారా తాగి తిప్పలు పెట్టినావు. తిరిగి నిన్ను మనిసిని సేస్పరికి అంతా అయిపోయి ఇలాగైపోనాను" అంది.

ముసలివాడు ముసలమ్మని చూశాడు.

వెన్నెల్లో గుమ్మడిపండులా కనిపిస్తున్న ముసలమ్మను ముట్టుకొని ముద్దు చెయ్యడానికి లేవబోయి ముసలమ్మ పక్కన పడుకున్న పడుచు పిల్లను చూసి ముద్దు చేసే ప్రయత్నం విరమించుకున్నాడు. అయినా ముసలమ్మను మరోసారి ముచ్చటగా చూసి

"ఎలాగైపోనావని ఇదై పోతన్నావు" గుమ్మడిపండు లాగ గుమ్ముగా వున్నావు. మరి నానే వాడిలిపోనాను. సూడిమీ జుత్తంతా పండిపోయి మొకం మాడిపోయి ముడుసుకుపోనాది" అన్నాడు.

ముసల్మ "గుమ్మడి పండు" అన్న మాట వినేసరికి ఆకాశపు వెన్నెల్లోకి చూస్తూ ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది.

ముప్పై ఏళ్ళ కిందట పోడు పంటల కాపు కోసం ... వెన్నెల్లో కొండ లెక్కడం - కొండ మేకల్నీ అడవి పందుల్నీ అదలించడం - గెడ్డల్లో స్నానాలాడ్డం - అడవి పూలు ఏరి తెచ్చుకొని అడవి గెంతులు గెంతడం.

అప్పుడొచ్చాడు గురువు. ఎక్కడ్నుంచి వచ్చాడో ఎవరికీ తెలియదు. చదువు చెబుతానని పిల్లల్ని పిలిచాడు. బోసి మొలల్తో దిసబోడిగా వున్న పిల్లలకు గోచీలు కట్టించాడు. పళ్ళు తోముకొనడం కూడా తెలియని పిల్లలకి గెడ్డ దగ్గరకు తీసుకొనివెళ్ళి పళ్ళు అతనే తోమి స్నానం చేయించడం ... చూసి - మొదట అడవి ఆశ్చర్యపోయింది. ఆ తరవాత గురువు ఆ ఊరి పిల్లనే పెళ్ళి చేసుకుంటున్నాడని తెలుసుకొని ఆ ప్రాంతం ప్రాంతం కొండ గూడలన్నీ కదిలివెళ్తుండగా తనూ కలిసివెళ్ళింది.

గురువు పెళ్ళి చూడ్డానికి వచ్చిన సవరగూడ కుర్రాడొక్కడు పెళ్ళి చూడకుండా తననే చూస్తూ, సైగ చేశాడు. తను తప్పించుకుంటూ తిరుగుతుండగా వొడుపుగా చెయ్యి పట్టుకొని పదిమంది నుండి పక్కకు లాగేసి

"గుమ్మిడిపండు లాగున్నావు! రాయే గుంటా?"

అని భుజం మీద చెయ్యి వేశాడు! అంతే...!

తన గూడ సవర్లు అది చూస్పేరు. ఇక తగువుకి దిగిపోయారు.

గురువు కలగజేసుకొని అల్లరి ఆపేసి ఇద్దర్నీ కలిపి



"ఎం.ఎ. చదివిన మీ అబ్బాయిని పశువులను మేపడానికి పంపారుగా, ఏమయింది?"

"మంచిదే జరిగింది. 'పశువులను మేపడంలోగల సాధక బాధకములు' అన్న అంశంపై థీసిస్ వ్రాసి డాక్టరేటు పుచ్చుకున్నాడు."

ఇంటివార్ని చేసేదు. అలా కలిసి ఒక ఇంటివారైనప్పుడు ... పోడు పంటల్లో గెడ్డ జొలల్లో విప్ప తోటల్లో ఎండల్లో వానల్లో చల్లని చలిలో ఎన్నెన్ని వెచ్చని ఆటలు ... మరెన్ని తీయని పాటలు! పకపకమని నవ్వుల పరుగులు.

అవన్నీ ఆ సంగతులన్నీ ముసలమ్మకు వెచ్చని జ్ఞాపకాల్ని వెన్నెలగా తెచ్చాయి.

గుమ్మడిపండు లాంటి ఆనాటి గుంట ఇప్పుడు ముసలి గుమ్మడిపండు అయింది.

అలా ఆ జ్ఞాపకాల్లోంచి ఆకాశపు అడవి వెన్నెల్ని చూసి చూసి ముసలి వాన్ని చూసింది.

అతను నిద్రపోతున్నాడు.

ముసలి గుమ్మడి నిద్రపోతున్న ముసలివాన్ని మరోసారి ముచ్చటగా చూసి తనలో తనే నవ్వుకొని పక్కన పడుకున్న పడుచుపిల్లను కుదుపుతూ

"అటేరి జరిగే! నానెక్కడ తొంగోవాలా" అంది.

పడుచుపిల్ల నిద్రమత్తుగా లేచి

"మావ పక్కన జాగా వుంది, అక్కడ తొంగో అత్తా" అంటూ నిద్ర నవ్వు నవ్వింది.

ముసలి గుమ్మడి ముఖం వెన్నెలంత వెలుగు వెలిగి నవ్వుతూ

"ఈ కాలం గుంటముండలు మాసెడ్డ కావోలు" అంటూ పడుచుపిల్లను పక్కకు తోసి చోటు చేసుకొని పడుకుంది.

ఆ — ఉదయం!

అడవిలో ఎండ అడవిని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తోంది. అడవి మధ్య ఊరు హడావిడిగా వుంది. అడవిలో ఊరి ఆడా మగా చిత్రం చూస్తున్నట్టు చూస్తున్నారు.

కారులో వచ్చిన ఒక తెల్ల బట్టల కుర్రాడు కొత్తగా తీయించిన బోర్ వెల్ చుట్టూ పేరుకుని పరుగులతో లుకలుకలాడుతున్న బురదని పారతో తీసి దూరంగా పారబోస్తున్నాడు.

మరికొన్ని జీపుల్లో వచ్చిన వాళ్ళు మరింత హడావుడి పడిపోతూ అతని చేతిలోని పారను తీసుకొనేందుకు భయపడుతూ ప్రయత్నిస్తున్నారు. ఆయన వారికి అవకాశం ఇవ్వకుండా

"శుభ్రం చెయ్యని నీరు తాగితే రోగాలు వస్తాయని మీకు ఎప్పటికి తెలుస్తుంది, తాగే నీటి చుట్టూ ఈ బురదేంటి? మీరంతా ఏం చేస్తున్నారు??" అని ఉద్యోగుల్నీ, ఊరివాళ్ళనీ కలిపి తిట్టేదు.

ఊరి జనంతో పాటు ముసలివాడూ - ముసలి గుమ్మడీ, పడుచుపిల్లా ఈ వింత మాస్తున్నారు.

అలా మాస్తున్న ముసలి గుమ్మడికి అలనాడు తన ఊరి పిల్లలకి శుభ్రం నేర్పించిన గురువు గుర్తుకొచ్చాడు. అలా అతన్నే మాస్తూ ముసవివాడితో

"సూసినావా! ఆ బావుని?!" అని అడిగింది.

ముసలివాడు సమాధానం చెప్పేలోగా - శుభ్రం చేసిన బాబు చుట్టూ చేరిన జనంలో కొందరు

"బావూ మాకు లోన్లు! బావూ మకు గేదలు! బావూ మాకు ఆసప్రతి! బావూ మాకు ... మాకు"

గో గోల! గగ్గోలు!!

అది మాసిన ముసలివాడు ముసలి గుమ్మడికి సమాధానం చెప్పకుండా

"చట్! పదాప్"! అని గుంపు మంది తప్పుకొని నడిచాడు. మారుమాట లేకుండా ముసలి గుమ్మడీ, పడుచుపిల్లా అతన్ని అనుసరించారు.



వారు అలా నడిచి ఊరుదాటి ఎర్రకంచెమ్మ కొండ పక్కవాలులోనికి దిగిపోయి గెడ్డ జొల చేరుకున్నారు.

ఎండ ఎలా వున్నా చక్కని నీడా, చల్లని గాలీ పారుతున్న సెలయేటి గలగలలూ రకరకాల ఆకులతో చెట్లూ లతలూ విరబూసిన పూలూ చూసి పడుచుపిల్ల పడుచు గెంతులు గెంతుతూ "అదేటి మావా? ఇదేటి మావా?!" అని అడుగుతోంది. అలా అడుగుతూ గెడ్డ పక్కనున్న లోయ ఇరుకున గల అరటి చెట్టుకున్న అరటి గెలను చూసి ఆశ్చర్యపోయింది. అరటి గెల ఎరుపుగా అంతలేసి కాయల్తో నవనవలాడుతోంది.

"అదిచ్చీ మావా! మా ఊరొట్టి కెళ్తాను" అంది.

ముసలి గుమ్మడి ఆ మాటవినితెయ్యిమని గెంతింది!

"ఇచ్చీ ఇచ్చీ! ముద్దుల కోడలు మూతి పట్టదు! తిని బలుస్తాది! అందుకేనేటి పాంగొస్తావు మావా! మావా" అని వెటకారం చేసింది.

పడుచుపిల్ల పరాచికంగా

"అత్తకి తినిపించీ మావా! అంతుంది గదా. మరింతయిపోయి మా మూతులిరగబొడుస్తాది" అంది.

దానికి ముసలి గుమ్మడి మూతి మూడు వంకర్లు తిప్పి

"చదివిసినావని గొప్పయిపోయి గోడెక్కిపోకే పిల్లా! అంటిగెలే వొట్టుకనెలిపోతావో ... మీ మావనే ఎత్తుకోనెలిపోతావో అది గది నీ ఇష్టం! నాకేల మద్దిన" అంది.

చదివిన పడుచుపిల్ల మరింత సరదాగా

"బావ జావైపోయిన మావ నా కెందుకూ?! నువ్వే ఎత్తుకోని ఎగరేసుకోని ముద్దులాడేసుకో" అంటూ అత్తకి అందకుండా మావ పక్కకి పరిగెత్తిపోయింది.

"హత్తెరి గుంటముండా" అన్న ముసలి గుమ్మడి పడుచుపిల్ల పరుగుచూసి ముసిముసి నవ్వింది. ముసలి వాడు ముచ్చట పడిపోయాడు.

ఆ మాటలకు — ముచ్చటపడుతున్న ముసలి వాడితో ముసలి గుమ్మడి

"ఇందొకటి బావుని సూసినావు గదా! ఈ గెల ఆ బావుకిచ్చిద్దుం" అంది.

ముసలివాడు ఆశ్చర్యంగా "ఎందుకూ?" అని అడిగాడు. ముసిలి గుమ్మడి చెప్పింది.

"ముప్పై పంటల కిందట మనిద్దర్నీ కలిపిన గురువు ఇలాగే మా ఊరి గుంటల మురికి వొదలగొట్టడానికి కష్టపడినాడు. ఇయాల ఈ బావు మనూర్ల సేసిన పని సూస్తే ఆనాటి గురువు గురుతుకొచ్చినాడు" అని ఊపిరి తీసి వదిలింది.

"ఆ బావు ఎక్కడుంటాడో?!" అన్నాడు ముసలి వాడు.

"నాకు తెలుసును" అంది పడుచుపిల్ల.

"ఉజ్జోగం ఎలగబెడుతున్నాది గదా! దీనికి అన్నీ తెలుసును" అంది ముసలి గుమ్మడి.

ముసలివాడు ఆలోచిస్తూ

"అలాగే సేద్దుంగాని" అని చెట్టుకున్న అరటి గెల దించాడు. ముగ్గురూ పట్నందారి పట్టారు.

అందంగా కనపడుతున్న రకరకాల పూల మొక్కల మధ్యగా అరటి గెలతో అలా ఆ ముగ్గురూ బంగళా చేరుకున్నారు. ముసలివాడు నిర్లిప్తంగా బంగళా వరండా ఎక్కేడు. ముసలి గుమ్మడి ముఖంలో మునుపటి ఉత్సాహం కనిపించకుండా ముడుచుకొనిపోయింది. పడుచుపిల్ల మాత్రం అక్కడ తెల్లని బట్టలతో నిలబడిన కుర్రాడితో ఏదో మాటాడింది.

కుర్రాడు లోనికి వెళ్ళివచ్చి

"అయ్యగారు రమ్మంటున్నారు" అని వెళ్ళమన్నాడు.

పైన మెల్లగా తిరుగుతున్న ఫేను కింద అయ్యగారు కుర్చీలో కూర్చొని వున్నారు.

అరటి గెలను దించిన ముసలివాడూ, ముసలి గుమ్మడీ

"దండాలు బావూ!" అన్నారు.


పడుచుపిల్ల "నమస్కారం సార్!" అంది.

అయ్యగారు ఆప్యాయంగా నవ్వేరు. "ఏ ఊరు?"




"ఒక పొలాన్ని ఇరవై మంది పది గంటల్లో దున్నితే అదే పొలాన్ని ముప్పై మంది ఎన్ని గంటల్లో దున్నుతారు?"

"దున్నిన పొలాన్ని దున్నడానికి వారికేమంత తెలివుండదా సార్




అని అడిగారు.

"మీరు బురద తీసివారు గదా, ఆ ఊరు" అన్నాడు ముసలివాడు.

అయ్యగారు ఆ తరవాత ముగ్గురి వివరాలూ అడిగారు.

"మీకేంటి కావాలి?" అన్నారు.

ఆ మాట విని ముసలిగుమ్మడి ముసలివాడి వంక ఆశ్చర్యంగా చూసింది. ముసలివాడు అలా అడిగిన అయ్యగారి ముఖంలోకి తెల్లబోయి చూస్తున్నాడు. పడుచుపిల్ల మాత్రం పకపక నవ్వకుండా ముగ్గుర్నీ మార్చి మార్చి చూస్తూ మనసులో నవ్వుకుంది.

"మాకేటి కావాలబావూ?" చాలా సేపటి తర్వాత ముసలివాడు తిరిగి ప్రశ్నించాడు.

ముసలి గుమ్మడి అయ్యగారి ముఖంలోకి చూస్తూ "బావూ! ఆయాల మా ఊర్ల మురికి తీసినావు గదా?! అదిగప్పుడు నువ్వు మా గురువులాగ అగుపడ్డావు. అప్మానం అలాగ అనిపించినప్పుడు అలాటోరికి ఏదైనా యియ్యడం మా వోజీబు" అంది.

ఈసారి అయ్యగారు ఆశ్చర్యపోయారు.

ఊరికినే ఖరీదు చెల్లించకుండా ఎవరి నుండీ ఎప్పుడూ ఏదీ తీసుకోవడం అలవాటులేని అతనికి ఏం చేయాలో మొదట తెలియలేదు. ఆ తరవాత అరటి గెలను కళ్ళతో అంచనావేసి రేటుకి రెట్టింపుగా వంద రూపాయిల కాగితం తీసి టేబులు మీద పెట్టారు.

"తీసుకోండి" అని తీసుకోమన్నారు.

ముసలివాడి ముఖం రంగు మారిపోయింది.

"బావూ! మా గురువెప్పుడూ ఇలాగ సెయ్యలేదు. తెచ్చింది పుచ్చుకొని నవ్వీసేవాడు. నలుగురికి పంచీ వోడు. అందర మంది కలిసి వొళ్లిం తిని సరదాపడి పోయి వోలిమి. మాకు అప్మానం పుడితే యియ్యడం తెలుసునుగానీ సొమ్ము పుచ్చుకోవడం తెల్దుమరి! తప్పయిపోనాది. సెమించీ బావూ!" అనేసి వెనుదిరిగి గబగబా నడిచాడు.

ఆ వెనక ముసలి గుమ్మడి నడిచింది. పడుచుపిల్ల వరండా దాటుతున్న ముసలివాడితో

"మంచిపని చేసేవు మావా" అని మెచ్చుకుంది.

ఆ మాట విన్న అయ్యగారు ఉలిక్కిపడి కుర్చీలో నుండి లేచేరు.

ఆప్యాయతకు చిహ్నంగా మిగిలిన అరటి గెలా – దానికి విలువ నిర్ణయించిన వంద రూపాయిల కాగితమూ రెండూ రెండు ప్రశ్నలుగా కనిపించాయి?!

మొత్తం కొండ పద్ధతుల్ని బద్ధలుకొట్టి మారిన వారికి ప్రతినిధిగా కనిపించిన ఆ పడుచుపిల్ల మామనే ఎందుకు మెచ్చుకుంది?!

ఆయన ఆలోచనలో పడిపోయి మెల్లగా కిటికీ దగ్గరకు వెళ్ళి తెరను తొలగించి చూశారు.

దూరాన తూర్పుకొండలు కనిపిస్తున్నాయి.

"ఏమిటిది?!" అని ప్రశ్నించుకున్నారు.

అడవి ధర్మం! ఒకే ఒక సమష్టి భావన!

ఆయన ఆశ్చర్యానికి అంతులేదు.

ఆది మానవ జీవ సూత్రపు అంతర్గత విలువల అనంత శంఖారావం వింటున్నట్టుగా కొండల్ని చూస్తూ కిటికీ దగ్గర అలా వుండిపోయారు. ●

---

## యూత్ స్టోరీ



## మా తెలుగు మాస్టారు

సూళ్ళూరుపేట కాలేజీలో ఇంటర్ మీడియెట్ హెచ్.ఇ.సి. గ్రూప్ చదువుతున్నాము. హెచ్.ఇ.సి. విద్యార్థు లంటేనే అదోరకం మనస్తత్వం. వారి తత్వం ఎదుటివారికి ఇబ్బందికరంగా వుంటుంది. వారి పోకడలు వింతగా, విక్కతంగా వుంటాయి. వారి ఆకతాయితనానికి అర్థమే వుండదు. తమాషాగా రోజులు గడిపేందుకే చెక్కుమంది కాలేజీకి విచ్చేస్తారు. చదువు మీద శ్రద్ధగాని, గురువుల మీద గౌరవం గాని, తోటి విద్యార్థులపైన స్నేహభావంగాని మచ్చుకైనా కనిపించవు వారిలో. దానికి తగ్గట్టు మా క్లాసులో కలుగూరగంపలా 129 మంది విద్యార్థు లుండేవారు. వారిలో ఎవరు ఏ తిక్క చేష్ట చేసినా తెలుసుకోవడం కష్టతర మయ్యేది.

వీళ్ళ అల్లరికి దడిసి అంతంత మాత్రం గానే పాఠాలు చెప్పే లెక్చరర్స్ మధ్య ఓ మణిదీపంలాంటి లెక్చరర్. నిశిత దృష్టితో స్టూడెంట్‌ను పరిశీలించి, వారి భావాలకు అనుగుణంగా పాఠంతోపాటు విన సొంపుగా మాటలు, విలువైనన్ని కథలు బోధించి, హాస్యోక్తులు-చతురోక్తులతో స్టూడెంట్స్‌ను ఇట్టే ఆకట్టుకొని వారి బుర్రలో పాఠ సారాన్ని నింపేవారు. ఆయనే మా 'తెలుగు మాస్టారు'.

ఓసారి ఆయనో పద్యాన్ని రాగయుక్తంగా పాడుతున్న సమయంలో వెనుక సీటులో కూర్చున్న ఓ ఆకతాయి విద్యార్థి ఎగతాళిగా "గాడిదలు వస్తున్నాయి సార్" అని అరిచాడు. మేమంతా ఉలికిపాటుతో పాటు కాస్తంత కలవరపడ్డాం. మా మాస్టారు మాత్రం చిరునవ్వుతో "గాడిదలు 'రావడం' ఏమిటి? వచ్చి అరుస్తున్నాయి చూడు" అన్నారు. ఆ మాటతో ఆ అబ్బాయి నవ్వులపాలయ్యాడు.

—రాజేశ్వరి

## సగంలో వీడ్కోలు పలికిన మిత్రుడు

మేము అయిదుగురం మిత్రులం ఇంటర్‌మీడియెట్‌లో. మా మాట, మా బాట ఒకటి కావాలని; ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒక్కరం అన్నట్టుగా చదువుల్లోను, ఆటల్లోను ఒకరికి ఒకరు సహాయపడుతూ ఒకరికి తెలియని విషయాన్ని వేరొకరిని అడిగి తెలుసుకుని అందరిలోకి మొదటివారిగా వుండేవాళ్ళం. మాలో ఒకడైన నా మిత్రుడు మాతో కాలేజీలో చదువుతూ సాయంకాలం పూట ప్రైవేట్లు చెపుతూ తన తండ్రికి చేదోడు వాదోడుగా వుండేవాడు. అంత చిన్న వయసులోనే తెలివితేటలను, మంచి మనసును తెచ్చుకున్న వాడిపై కన్నుకుట్టిన భగవంతుడు చిన్న చూపే చూశాడు. వాడికి పచ్చకామెర్ల వ్యాధిని తగిలించి తన తల్లిదండ్రులకు పుత్ర శోకాన్ని కలిగించాడు. మాకు మా మిత్రుడ్ని దూరం చేసిన దేవుడ్ని నిందిస్తూ మా గుండె లోతుల్లో ఎప్పటికీ చెరిగిపోని ముద్రవేసిన మా మిత్రుణ్ణి తలచుకుని బాధపడతాం. కాని, పోయిన ఆ రోజులూ రావు, దూరమయిన మా మిత్రుడూ రాలేడు, ఇక రాడు కూడా.



—దామోదరపాత్రుని గణేష్‌బాబు, విజయనగరం

## సంస్కృతం

ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో సేకరించిన 'సెన్సస్' ప్రకారం 500 మంది సంస్కృతం తమ మాతృ భాషగా పేర్కొన్నారు. అంటే- ఈ నాటికీ మన దేశంలో దేవ భాష సజీవంగానే వుందన్నమాట!

- ఎస్.బి. రెడ్డి